
# మలుపు



## కొనసం మహేశ్వరరావు

'నన్నెందుకు అంత కష్టపడి చదివించావ్, నాన్నా...' స్వామి తనలో తానే అనుకుంటూ నుదురు పదేపదే సవరించుకుంటున్నాడు. ట్యాంక్‌బండ్ మీద బెంచీపై పడుకుని వచ్చే పోయే వాహనాలను, హుసేన్‌సాగర్‌లో కదలలేక కదులుతున్న అలలను మార్చి మార్చి చూస్తున్నాడు. దినకరుడు జబ్బుపడిన వానిలా పడమటి కొండల్లో నడవలేక నడుస్తున్నాడు. నీరెండ గొంతుఎండి బిగుసుకు పోతున్నట్లు ఉంది. బాధల నన్నింటినీ తానే భరిస్తున్నట్లు పడమటి కొండ ముఖం వాడి కందిపోయి ఉంది. గాలి దేవుడు రోగగ్రస్తుడై ఎక్కడో పడి ఉన్నట్లు, గాలి అసలు లేనేలేదన్నట్లుగా ఉంది. అంతస్తుల బస్సులు నడుస్తున్నట్లు మధ్య మధ్య విసనకర్రతో విసిరి నట్లు తగులుతున్నది గాలి.

'ఈ ఆకలికి బుద్ధి లేదు' అను కున్నాడు. అలా అనుకున్నందుకు నవ్వు రాక తప్పలేదు. ఆకలి పుట్టింది తనతో. తనతోపాటే పుట్టింది. అందుకని ఆకలి వేరు, తను వేరు కాదని అప్పుడే సిద్ధాంతీక రిస్తున్న మేధావిలా నవ్వుకున్నాడు. కాస్త దూరంలో మొక్కజొన్న పొత్తులు అమ్ముతున్నాడు ఓ ముసలాయన. ఆ పక్కనే వేరుశెనగకాయలు, బఠాణీలు అమ్ముతున్నాడు ఓ కుర్రవాడు. అటు పక్కనుంచి వేపుడువాసన అలలు 'అలలుగా' వచ్చి వికారం కలిగిస్తున్నది. ఆ పక్కనే టీ స్టాలు. సమోసాలు, బిస్కట్లు అతని ఆకలిని మరింత ఎక్కువ చేస్తున్నాయి. జేబులో చేయి పెట్టాడు. చిల్లర డబ్బులు తీసి లెక్క పెట్టాడు. తొంభై తొమ్మిది పైసలు భద్రంగా ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా ఎప్పటివరకు వాడాలో తనకే తెలియదు. అవును—ఎలా తెలుస్తుంది? మనిఆర్డరు ఎప్పుడొస్తుందో ఏమో? నాన్నకు అప్పు దొరకాలిగా. అప్పుడు తనకు మనిఆర్డరు వస్తుంది. ఇంట్లో అందరూ మాడి అయినా తన తిండికి డబ్బు పంపిస్తారు. ఎంత ఆశ! తను ఏదో వాళ్ళనందరినీ ఉద్ధరిస్తాడని వాళ్ళ ఆశ. చదువుకున్న తన కొడుకు గొప్ప ఉద్యోగం చేసి ఏనాటికైనా తమని ఉద్ధరిస్తాడని సమాధానపడి, ఎప్పటి కప్పుడు తృప్తిపడుతూ ఆశ పడే తల్లిదండ్రులు. కర్మకాలి ఒక వేళ తనకు ఉద్యోగం వచ్చినా వాళ్ళను ఆదుకోలేనని తెలిసి గంపెడాశలు మనసున నింపుకొని, సమాధానపడుతూ ఎదురుచూసే కుటుంబం. 'భగవంతుడా, ఏమిటి నాకు ఈ పరీక్ష? ఇంత హింస పెట్టే బదులు ఒకసారే నా ప్రాణం తీసుకోకూడదూ... ఏ కారుకిందనో, ఏ రైలు కిందనో, ఏ లారీ కిందనో నన్ను పడవేయకూడదూ'

